నిర్మించినా.. నిరుపయోగమే..

- గ్రామాల్లో అలంకారప్రాయంగా క్రీడా ప్రాంగణాలు
- సౌకర్యాలు లేని చోట్ల ఏర్పాటు
- ఆసక్తి చూపని యువత, విద్యార్థులు



ఇది మెట్‌పల్లి మండలం కొండ్రికర్ల గ్రామ క్రీడా ప్రాంగణం. గ్రామానికి కిలో మీటర్ దూరంలో ఏర్పాటు చేయడంతో ఆటలు ఆడేందుకు ఇక్కడికి ఎవ్వరూ రావడం లేదు. దీంతో ఈ క్రీడా ప్రాంగణం నిరుపయోగంగా మారింది. ఇలా ఈ ఒక్క చోటే కాదు మండలంలోని చాలా చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది.

మెట్‌పల్లి రూరల్: యువత, విద్యార్థులు, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు వెలవెలబోతున్నాయి. అనువుగా లేని ప్రాంతాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయడంతో ఖాళీ గానే దర్శనమిస్తున్నాయి. ఊరి చివరి ప్రాంతాల్లో ఉండడంతో యువత పెద్దగా ఆసక్తిగా చూపడంలేదని తెలుస్తోంది. ఫలితంగా పలు చోట్ల క్రీడమైదానాలు నిరుపయోగంగా మారాయన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

స్థల సమస్యతోనే ఇబ్బందులు..

మెట్‌పల్లి మండలంలో 26 క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేయగా, వీటికి రూ.19.6 లక్షల ఉపాధి హామీ నిధులు వెచ్చించారు. అయితే క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలనే గత ప్రభుత్వ లక్ష్యం బాగానే ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో స్థల సమస్యతో ఇబ్బందులు తలెత్తాయి. యువతకు అనువుగా ఉండే చోటే ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని అధికారులు తీవ్రంగా శ్రమించినప్పటికీ పలు చోట్ల సాధ్యం కాలేదు.కొన్ని చోట్ల స్థలం ఉన్నప్పటికీ సరిపడా లేకపోవడం, మరికొన్ని చోట్ల గ్రామానికి దూరంగా ఉండడంతో చేసేదేమి లేక ఖాళీ స్థలం ఉన్నచోటే క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. దీంతో యువత అంతదూరం వరకు వెళ్లి ఆటలు ఆడేందుకు పెద్దగా ఆసక్తి చూపడంలేదని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు.

పరికరాలు ఏర్పాటు..

గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల్లో ఆడుకునేందుకు ఇబ్బందులు లేకుండా చదును చేయించారు.అలాగే వాలీబాల్,షటిల్ లాంటి క్రీడలు ఆడేందుకు పరికరాలు ఏర్పాటు చేశారు.ఆటలు ఆడేందుకు సౌకర్యవంతంగా ఉన్నప్పటికీ ఒక్క అనువైన ప్రాంతంలో ఏర్పాటు చేయలేదనే కారణంతోనే వాటివైపు యువత కన్నెత్తి చూడడంలేదని తెలుస్తోంది.క్రీడా ప్రాంగణాలు ఖాళీగా ఉండడంతో పలు ప్రాంతాల్లో రైతులు పంట ఉత్పత్తులను ఆరబోసేందుకు వినియోగించుకుంటున్నారు.

వినియోగంలోనే ఉన్నాయి

మెట్‌పల్లి మండలంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు వినియోగంలో ఉన్నాయి.కొన్ని చోట్ల స్థల సమస్య ఉన్నప్పటికీ అనువైన ప్రాంతాల్లోనే యువతకు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేశాం.యువత వాటిని వినియోగించుకోవడంతో పాటు ఆటలు ఆడుతున్నారు.అందులో పలు పరికరాలు కూడా ఆటలు ఆడేందుకు వీలుగా ఉన్నాయి.

– భీమేశ్‌రెడ్డి, ఎంపీడీవో, మెట్‌పల్లి

కుటుంబాలకు మించి దరఖాస్తులు

- పక్కా నమోదుకు కార్యాచరణ
- 17లోపు పూర్తి చేయాలని ఆదేశాలు
- చురుగ్గా సాగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియ



దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది

పెగడపల్లి: ఆరు గ్యారంటీ పథకాల అమలులో భాగంగా అర్హులను గుర్తించేందుకు ప్రభుత్వం గత నెల 28 నుంచి ఈ నెల 6 వరకు ప్రజా పాలన పేరుతో మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. మండల వ్యాప్తంగా 11,234 కుటుంబాలుండగా వివిధ పథకాలకు 14762 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో రేషన్ కార్డులుండి దరఖాస్తులు చేసుకున్న వారు 12809, రేషన్ కార్డులు లేకుండా దరఖాస్తులు చేసుకున్న వారు 1032, కొత్త రేషన్ కార్డుల కోసం 2049 దరఖాస్తులు వచ్చాయి. అందిన దరఖాస్తుల్లోని వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభమైంది. ఈ నెల 17లోపు నమోదును పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు మండలంలో వచ్చిన దరఖాస్తులు ఆన్‌లైన్ చేసేందుకు ఈ పంచాయతీ ఆపరేటర్లు 4, ఈజీఎస్ ఆపరేటర్లు 2, మీ సేవ నిర్వాహకులు 8 మంది ఐకేపీ నుంచి 1, ప్యాక్స్ నుంచి 2 ఆపరేటర్లను నియమించి ఆన్‌లైన్ చేయిస్తున్నట్లు ఎంపీడీవో వుల్లయ్య తెలిపారు. ఆన్‌లైన్ ప్రక్రియను ఎంపీడీవో, ఎంపీవో మహేందర్, డీటీ విష్ణువర్ధన్ పర్యవేక్షిస్తున్నారు.

ఆన్‌లైన్‌లో తప్పులు లేకుండా చూడాలి



దరఖాస్తుల ఆన్‌లైన్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో

మల్లాపూర్: ప్రజాపాలన దరఖాస్తులు ఆన్‌లైన్ చేయడంలో తప్పులు దొర్లకుండా చూడాలని ఎంపీడీవో రాజశ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంతో పాటు అన్ని గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను సోమవారం పరిశీలించి మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు, ఆపరేటర్లు దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పకడ్బందీగా చేయాలన్నారు. దరఖాస్తులోని వివరాలను అప్‌లోడ్ చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో జగదీశ్, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు, మండల పరిషత్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుల శ్రమదానం



రోడ్డుపై గుంతలు పూడ్చివేస్తున్న యువకులు

బుగ్గారం: మండల కేంద్రం నుంచి జాతీయ రహదారి వద్ద గల ఎక్స్‌రోడ్డు వరకు గల రహదారి లోతైన గుంతలతో ప్రమాదకరంగా మారడంతో ఇటీవల పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో మండల వాసులు అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం కనబడలేదు. దీంతో గ్రామ యువకులు స్పందించి స్థానిక నాయకుడు భారతపు గంగాధర్ ఆధ్వర్యంలో శ్రమదానంతో రోడ్డుపై గుంతలను పూడ్చివేశారు. దీనికి అవసరమైన ఖర్చులను గంగాధర్ భరించి, స్థానిక యువకులను భాగస్వాములను చేసి రహదారిని తాత్కాలికంగా బాగు చేశారు. కార్యక్రమంలో పలువురు గ్రామ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రాములోరి అక్షింతలు పంపిణీ





కోరుట్లలో రాములవారి అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు ధర్మపురి మండలం తీగలధర్మారంలో..

కోరుట్ల: పట్టణంలోని 13వ వార్డులో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో గడప గడపకు అయోధ్య రాములోరి అక్షింతలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట, తాండ్య్రాల గ్రామాల్లో అయోధ్యలో శ్రీరాములవారి అక్షింతలను సోమవారం ఊరేగించారు. రామాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాల్లో జై శ్రీరాం అంటూ నినాదాలు మార్మోగించారు. కార్యక్రమంలో సర్పంచ్ కూన సులోచన, వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, ఉపసర్పంచ్ పల్లె సరిత, నాయకులు పాల్గొన్నారు.

రాయికల్: అయోధ్య శ్రీరాములవారి అక్షింతలను మండలంలోని కుమ్మరిపల్లి, శివాజీనగర్ గ్రామాల్లో ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గ్రామాల్లో శోభాయాత్ర నిర్వహించి ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండల కేంద్రంతో పాటు చిట్టాపూర్, వేంపల్లి గ్రామాల్లో సోమవారం అయోధ్య రాముల వారి అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు, మహిళలు మంగళహారతులతో స్వాగతం పలుకగా, ఊరేగింపుగా వెళ్తూ ప్రతి ఇంటికీ అందజేశారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపసర్పంచ్‌లు, నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

సారంగాపూర్: మండలంలోని లక్ష్మీదేవిపల్లి, పెంబట్ల, కోనాపూర్ గ్రామాల్లో సోమవారం అయోధ్య శ్రీరాములవారి అక్షింతలను శోభయాత్రతో ఇంటింటా పంపిణీ చేశారు.

ధర్మపురి: మండలంలోని తీగలధర్మారంలో సోమవారం అయోధ్య రాముల వారి అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అందాలు, మాజీ సర్పంచులు జంగిలి ప్రభాకర్, పందిరి తిరుపతి, అశోక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మేడిపల్లి: మండలంలోని మేడిపల్లి, తొంబరావుపేట ఓడ్యాడ్, మోత్కురావుపేట గ్రామాల్లో సోమవారం అయోధ రాముల వారి అక్షింతలు ఇంటింటా పంపిణీ చేశారు.అక్షింతలకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమాల్లో సర్పంచులు,ఎంపీటీసీలు, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

దుబ్బరాజన్న ఆలయంలో వసతుల కల్పనకు టెండర్లు

సారంగాపూర్: మండలంలోని పెంబట్ల శ్రీ దుబ్బరాజేశ్వరస్వామి ఆలయంలో జాతర సందర్భంగా స్వామివారికి భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా వసతుల కల్పనకు సోమవారం షీల్డ్ కొటేషన్ టెండర్లు నిర్వహించారు. మధ్యాహ్నం 4 గంటల తర్వాత టెండర్లు ఓపెన్ చేయడంతో హక్కుదారులను ప్రకటించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రంగు రవికిషన్, సర్పంచ్ బొడ్డుపల్లి రాజన్న, కోనాపూర్ సర్పంచ్ ఆకుల జమున, ఎంపీపీ కోల జమున, కార్యనిర్వహణాధికారి అనూష పాల్గొన్నారు.

టెండర్లకు ఆహ్వానం

సారంగాపూర్: బీర్‌పూర్ లక్ష్మీనృసింహస్వామి దుకాణాల నిర్వహణకు టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు. ఫిబ్రవరి 19 నుంచి జరిగే బ్రహ్మోత్సవాలు జాతర పురస్కరించుకుని కొబ్బరికాయలు, బెల్లం, లడ్డు, పులిహోదా, పట్టెనామాలు, కోరమీసాలు, గండదీపం నూనె, కొబ్బరిముక్కలు, తలనీలాలు తదితర షాపుల నిర్వహణ కోసం టెండర్లకు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 19న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కౌన్సిలర్

ధర్మపురి: పట్టణంలోని హెస్‌హెచ్ గార్డెన్‌లో సోమవారం ధర్మపురి లయన్స్‌క్లబ్ వారి ఆధ్వర్యంలో రేకుర్తి ఆస్పత్రి వైద్యులచే ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వివిధ మండలాలకు చెందిన 300 మంది వరకు హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. కంటిలో మోతె బిందువు, ఇతర సమస్యలున్న 80 మందిని గుర్తించి 32 మందిని ఆపరేషన్ నిమిత్తం రేకుర్తి ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సాయిని సత్యనారాయణ, కౌన్సిలర్ వేముల నాగలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌లో కాంగ్రెస్‌దే విజయం

మెట్‌పల్లి: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ఆ పార్టీ ఎన్నికల కమ్యూనికేషన్ కమిటీ సభ్యుడు ఎండీ ఆవేజ్ అన్నారు. పట్టణంలో సోమవారం మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీల పట్ల ప్రజలకు విశ్వాసం కలగడం వల్లనే కాంగ్రెస్ విజయం సాధ్యమైందన్నారు. వంద రోజుల్లో వాటిని అమలు చేసే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా సీనియర్ నాయకుడు జీవన్‌రెడ్డి నియమించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా గోదా – రంగనాథుల కల్యాణం



యామాపూర్‌లో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, హాజరైన భక్తులు

కథలాపూర్: మండలకేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోదాదేవి- రంగనాథుల కల్యాణం సోమవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. ఉత్సవాల్లో సర్పంచ్ కంటి నీరజ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని యామపూర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి రంగనాయకుల కల్యాణాన్ని అర్చకులు మాదవచార్యులు, నవీన్‌చార్యులు ఘనంగా నిర్వహించారు. భక్తులు భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తలారీ మనీషా, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

ధర్మపురి: మండలంలోని నేరెల్ల సాంబశివ ఆలయంలో సోమవారం ఆలయ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కాసారపు రాజయ్య ఆధ్వర్యంలో వేద పండితులు శివప్రసాద్ శాస్త్రి మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం న్యాయవాది జాజాల రమేశ్ రూపొందించిన 2024 క్యాలెండర్‌ను ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సతీమణి అడ్లూరి కాంతాకుమారి ఆవిష్కరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గోవిందుపల్లె సర్పంచ్ రాజయ్య, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసారపు బాలాగౌడ్, కాశెట్టి మల్లేశం, సత్యనారాయణ, శ్రీ రాజరాజేశ్వర దేవస్థానం చైర్మన్ జంగిలి తిరుపతి తదితరులున్నారు.

క్లుప్తంగా

రైతుల సంక్షేమమే ధ్యేయం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సొసైటీ చైర్మన్

రాయికల్: రైతుల సంక్షేమమే సహకార సంఘం ధ్యేయమని భూపతిపూర్ సింగిల్ విండో చైర్మన్ ఏనుగు ముత్యంరెడ్డి అన్నారు. మండలంలోని భూపతిపూర్ సహకార సంఘం భవనంలో సోమవారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు రాయితీలు కల్పిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రశేఖర్, వైస్ చైర్మన్ నాగుల మల్లయ్య, డైరెక్టర్లు పాల్గొన్నారు.

పాఠశాలలో సరస్వతీ విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠలో దాత, నాయకులు

రాయికల్: మండలంలోని చెర్లకొండాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గ్రామ మాజీ సర్పంచ్ అల్లకొండ సుదర్శన్–పద్మ ఆధ్వర్యంలో సుమారు రూ.50 వేల వ్యయంతో ఏర్పాటు చేసిన సరస్వతీ దేవి విగ్రహాన్ని సోమవారం ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆకుల రాజ్యలక్ష్మి, విద్యాకమిటీ చైర్మన్ మానాల వెంకటేశ్, హెచ్‌ఎం నరేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోళ్ల ఫారం తొలగించాలి

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద నడి ఒడ్డున ఉన్న కోళ్లఫారంను తొలగించాలని సోమవారం ప్రజావాణిలో సరసం హరిప్రసాద్ ఫిర్యాదు చేశారు. కోళ్లఫారంతో చుట్టు పక్కన ఇళ్లకు దుర్వాసన వస్తోందని, దీంతో రోగాల బారిన పడే అవకాశం ఉందని గ్రామపంచాయతీలో ఫిర్యాదు చేయగా, జీపీ నుంచి నోటీసులు జారీ చేసినా కోళ్లఫారం నడిపిస్తున్నాడని వెంటనే యాజమానిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

ఇబ్రహీంపట్నం: రైతు సమన్వయ సమితి సభ్యుడు ఐలాపురం భూమారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు గుజ్జుల రమేశ్ సోమవారం మెట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరిక

మెట్‌పల్లి: పట్టణాభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీలోకి చేరినట్లు ఇటీవల బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన ప్రజాప్రతినిధులు, నాయకులు తెలిపారు. పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం మాట్లాడారు. నియోజకవర్గంలో జువ్వాడి నర్సింగరావుతోనే అభివృద్ధి సాధ్యమని, సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్‌లో చేరామన్నారు. సమావేశంలో కౌన్సిలర్ మర్రి సహదేవ్, కోఆప్షన్ సభ్యులు మార్గం గంగాధర్, నాయకులు పాల్గొన్నారు.

సదెరం శిబిరంలో ఎక్కువ మందిని పరీక్షించాలి

కోరుట్ల: దివ్యాంగుల గుర్తింపు కోసం జిల్లాలో నిర్వహించే సదెరం శిబిరంలో ఎక్కువమందిని పరీక్షించాలని, అందుకు వైద్యాధికారులకు ఆదేశాలివ్వాలని కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు ప్రజావాణిలో భాగంగా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. సదరం శిబిరంలో రోజుకు 20 మందిని పరీక్షిస్తున్నారని, దివ్యాంగుల ఇబ్బందుల దృష్ట్యా కనీసం 150 మందిని పరీక్షించేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు.

నృసింహుని సన్నిధిలో అంబర్‌పేట ఎమ్మెల్యే



సారంగాపూర్: జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలకేంద్రంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామిని హైదరాబాద్ అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సోమవారం దర్శించుకున్నారు. ఎమ్మెల్యేకు అర్చకులు ప్రత్యేకంగా స్వాగతం పలికారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందించి, శాలువాలతో సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

రామాజీపేటలో కేంద్ర పథకాలపై అవగాహన

రాయికల్: మండలంలోని రామాజీపేటలో వికసిత్ భారత్‌లో భాగంగా సోమవారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బెజ్జంకి రమాదేవి, ఎంపీటీసీ మహేశ్, ఉపసర్పంచ్ హరీశ్‌రావు,వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పద్మశాలీల అభివృద్ధికి కృషి

ఇబ్రహీంపట్నం: పద్మశాలీల అభివృద్ధికి కృషి చేస్తానని పద్మశాలీ సంఘం రాష్ట్ర నాయకుడు సాంబారి ప్రభాకర్ అన్నారు. మండలంలోని వర్షకొండలో నూతనంగా నిర్మించిన పద్మశాలీ సంఘ భవనాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, మండల అధ్యక్షుడు చాట్ల గణేష్, సంఘ నాయకులు రాజేంద్రప్రసాద్, రాపెల్లి సురేష్, చిలివేరి శ్రీనివాస్, జోగ ధనుంజయ్, ఆనంద్, అమృతబాయ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ

మల్లాపూర్: మండల కేంద్రంలో మాజీ జెడ్పీటీసీ ఎల్లాల జలపతిరెడ్డిని సోమవారం కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించారు. ఈ నెల 1న జరిగిన రోడ్డు ప్రమాదంలో జలపతిరెడ్డి కుమార్తె సామ సుజాత మృతి చెందిన విషయం తెలిసిందే. మండలంలోని పలుగ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు జలపతిరెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు తోట సంతోష్, కేలేటి రాజన్న, ఎదులాపురం రమేశ్, నత్తి రాము, బీఆర్‌ఎస్ నాయకుడు ఎల్కా కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫాగింగ్ చేయాలని అధికారులకు వినతి

రాయికల్: పట్టణంలో దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయాలని కోరుతూ సోమవారం పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్ మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉండటంతో దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఫాగింగ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎద్దండి దివాకర్‌రెడ్డి, నాగరాజు, నరేశ్, రమేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

కోరుట్ల: పట్టణంలోని కేరళ హైస్కూల్‌లో విద్యార్థులకు ఎస్‌ఎస్ కాలిగ్రఫీ రైట్ టు రైట్ సెషన్ పోటీలు నిర్వహించారు. ఐదు రోజులుగా ఈ పోటీలు నిర్వహించగా, ప్రతిభ చూపిన విద్యార్థులకు సోమవారం బహుమతులు అందించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎంఏ బారి, ప్రిన్సిపాల్ సెలిన్ బారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

మెట్‌పల్లి: ప్రభుత్వ ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలను వెంటనే చేపట్టాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గాదె నర్సింగరావు సోమవారం కోరారు. బదిలీలు, పదోన్నతులకు టెట్ అర్హత నిబంధనను ఉపసంహరించుకోవాలన్నారు. స్పౌజ్ బదిలీలను వెంటనే చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ, 317 బాధిత ఉపాధ్యాయుల సమస్యలను కూడా పరిష్కరించేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మధ్యాహ్న భోజనానికి బియ్యం వితరణ

మల్యాల: ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల మధ్యాహ్న భోజనం కోసం స్థానికుడు దొంతరవేణి శేఖర్ క్వింటాల్ బియ్యంతోపాటు, వంట సామగ్రి కళాశాల అధ్యాపకులకు అందజేశారు. విద్యార్థుల ఆకలి తీర్చేందుకు దాతలు ముందుకు రావడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు రచన, సంధ్య, అత్తినేని శ్రీనివాస్, నరేశ్, నవాబ్, యువకులు పాల్గొన్నారు.

సమాచారం..

దరఖాస్తుల స్వీకరణ

జగిత్యాల: 2024–25 విద్యా సంవత్సరానికి గాను జగిత్యాల జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ జనరల్ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలుర పాఠశాల సమన్వయాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రూ.100 రుసుము ఆన్‌లైన్‌లో చెల్లించి జనవరి 25 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఉంటుందని, విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పెన్షనర్లకు వైద్య పరీక్షలు ఉచితం

- పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్

జగిత్యాల: ఉద్యోగులకు, పెన్షనర్లకు హైదరాబాద్‌లోని నిమ్స్‌లో అవుట్ పేషెంట్స్ చికిత్సలు, పరీక్షలు చేయించుకునే సౌకర్యం ఉందని తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమ్స్‌లో మూడు బ్లాక్స్ ఉన్నాయని, ఒకటి మెయిన్ బ్లాక్, రెండోది మిలినియమ్ బ్లాక్, మూడోది స్పెషాలిటీబ్లాక్. అవసరమున్న వారు ఈహెచ్‌ఎస్ కార్డును ఏ4 సైజు జిరాక్స్ తీసుకుని వెళ్లి కౌంటర్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని వారు ఇచ్చిన ఓపీ కార్డుతో డాక్టర్‌ను కలవాలన్నారు. అక్కడ ఆయా పరీక్షలు సైతం ఉచితంగా చేయించుకునే వీలుందని, రిజిస్ట్రేషన్ ద్వారా ఒక పేషెంట్‌కు ఇవ్వబడే సీఆర్ నంబరు భవిష్యత్‌లో ఆ నంబరు ద్వారానే రెన్యువల్ జరుగుతుందన్నారు. మెడిసిన్స్ ఉచితంగా కావాలనుకునే వారు ఖైరతాబాద్‌లోని వెల్‌నెస్ సెంటర్‌కు వెళ్లాలన్నారు.